ప్రధాని మోదీ, సైనికుల సంక్షేమం కోసం పూజలు


పూజలు చేస్తున్న బీజేపీ శ్రేణులు

నిజాంపేట్ : బాచుపల్లి బీజేపీ ఆధ్వర్యంలో దేశ ప్రధాని మోదీ, సైనికులు క్షేమంగా ఉండాలని కోరుతూ బాచుపల్లి క్రాంతినగర్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బాచుపల్లి అధ్యక్షుడు ప్రసాద్ రాజు, నాయకులు గణేశ్, గజ్జెల్లి సంతోష్, ఉదయ్, అజయ్‌రెడ్డి, ప్రవీణ్, జమదగ్ని, హరి, ప్రసాద్ దీపక్, శ్రీహరి, సంజీవి, విజయ్, క్రాంతినగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

తోపుడు బండి, వీల్‌చైర్ పంపిణీ


వీల్‌చైర్, తోపుడు బండి అందజేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వ్యవస్థాపకకురాలు అలేఖ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ గాజులరామారం కాంగ్రెస్ కార్యాలయంలో కందుకూరి రేఖకు తోపుడు బండి, దివ్యాంగుడు బాల్‌రెడ్డికి వీల్‌చైర్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభాగ్యులను ఆదుకుంటూ దివ్యాంగులు, మహిళలకు చేయూతనందిస్తున్న హోప్ ఆఫ్ హంగర్ సంస్థ చేపట్టే కార్యక్రమాలకు తనవంతూ చేయూతనందిస్తానన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రవి కుమార్, వెంకటేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం


బాటసారులకు మజ్జిగ పోస్తున్న ధర్మరక్ష ఫౌండర్ చికోటి ప్రవీణ్

నిజాంపేట్ : శ్రీ వాసవీ సేవక్ సంస్థ ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ధర్మరక్ష ఫౌండర్ చికోటి ప్రవీణ్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఉగ్రవాదుల కాల్పుల్లో వీరమరణం పొందిన తెలుగు రాష్ట్రానికి చెందిన సైనికుడు మురళీ నాయక్‌కు ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాసవీ సేవక్ సంస్థ వారు అన్నదానాలు, దుప్పట్లు, మజ్జిగ పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.

గంజాయి విక్రయాలపై కొరడా..!



ముమ్మరంగా పేట్‌బషీరాబాద్ పోలీసుల దాడులు

- క్రయవిక్రయాలపై ప్రత్యేక నిఘా
- పదుల సంఖ్యలో కేసులు నమోదు
- బానిసైన వారికి కౌన్సెలింగ్

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ పోలీసులు గంజాయి విక్రయాలపై కొరఢా ఝులిపిస్తున్నారు. స్టేషన్ పరిధిలో గంజాయి క్రయవిక్రయదారులను గుర్తించి తాట తీస్తున్నారు. పలు అడ్డాలపై దాడి చేసి రెండు మూడు నెలల వ్యవధిలోనే పదుల సంఖ్యలో పలువురిని అదుపులో తీసుకుని కేసులు నమోదు చేశారు. గంజాయి పూర్తి స్థాయిలో నిర్మూలనే లక్ష్యంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ నేతృత్వంలో సెక్టార్ల వారీగా ఎస్‌ఐలకు బాధ్యతలు అప్పగించి గంజాయి ఎక్కడి నుంచి సరఫరా అవుతుంది..? అనే దానిపై ప్రత్యేక దృష్టి సారించి విశ్వసనీయ సమాచారం మేరకు అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకుంటూ కట్టడి చేసే పనిలో పడ్డారు. అయితే కొనుగోలుదారుల్లో విద్యార్థులే అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

ఇటీవల నమోదైన కేసులు..

- ఫిబ్రవరి 22న జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ ఉమామహేశ్వర కాలనీకి చెందిన బోడ శ్యామ్, ఏ.సందీప్ నాయక్ గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడగా కేసు నమోదు చేశారు.
- ఫిబ్రవరి 24న భుక్యా శ్రేయస్ రాథోడ్ విద్యార్థి కొంపల్లి మున్సిపల్ పరిధిలోని అపర్ణ వద్ద గంజాయికి బానిసై పోలీసులకు చిక్కాడు.
- మార్చి 1న ఎస్ ఆకాశ్, జాయిన్ నమాన్, రాహుల్ జైన్ ముగ్గురు సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డు శ్వేత ఆర్యన్ అపార్ట్‌మెంట్ సమీపంలో గంజాయి సేవిస్తూ స్థానికంగా ఇబ్బందులు కలిగిస్తుండడంతో పెట్రోలింగ్ వాహనం సిబ్బంది అదుపులో తీసుకున్నారు.
- ఏప్రిల్ 8 న కమలేష్ కుమార్ భాగ్యలక్ష్మీ కాలనీలో ఉంటూ గంజాయికి బానిస కావడంతో కౌన్సెలింగ్ ఇచ్చి సరఫరా చేసే వారిపై నిఘా పెట్టారు.
- ఏప్రిల్ 9 న డ్రైవర్‌గా పని చేసేఅబ్దుల్ వాసిం సుభాష్‌నగర్‌లో గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకుని 900 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- ఏప్రిల్ 18న శ్రీకాంత్ బోయ్ ఉమామహేశ్వర కాలనీలో నివాసం అంటూ స్థానికంగా గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి అతని నుంచి 750 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.
- ఏప్రిల్ 25న డ్రైవర్‌గా పని చేసే సల్మాన్‌ఖాన్ జీడిమెట్ల ప్రభుత్వ పాఠశాల వద్ద గంజాయి విక్రయిస్తూ పోలీసులకు దొరికిపోయాడు. అతని నుంచి 1.350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- ఏప్రిల్ 26న డి.రోహన్, ఎం జాన్సన్, కె.సాయి కుమార్ ముగ్గురు కలిసి పద్మనగర్ ఫేస్ టు సమీపంలోని విద్యార్థులకు గంజాయి విక్రయించేందుకు వస్తుండగా పోలీసులు 540 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించారు.
- మే 6న కమటం భూమేశ్వర్ జొమాటో డెలివరీ బాయ్ గా పనిచేస్తున్నాడు. ఇదే క్రమంలో గంజాయికి అలవాటు పడ్డవారికి గంజాయి డెలివరీ చేస్తూ పోలీసులకు చిక్కాడు. అతని నుంచి 1.444 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.
- మే 10న అస్మత్ అన్సారీ బీహార్ నుంచి వచ్చి విద్యార్థులకు గంజాయి విక్రయిస్తూ కొంపల్లి బస్టాండ్ వద్ద పోలీసులకు దొరికాడు. ఇతని నుంచి 800 గ్రాముల గంజాయి మొబైల్ ఫోను స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులే లక్ష్యంగా గంజాయి విక్రయాలు..

పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు 40కి పైగా వివిధ కళాశాలలు ఉన్నాయి. దీంతో జిల్లాలు, రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్నారు. గంజాయి మత్తులో కొందరు స్థానికంగా అలజడి సృష్టిస్తున్న ఘటనలు వెలుగులోకి రావడంతో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ గంజాయి విక్రయిస్తున్న వారిపై నిఘా పెట్టాడు. కొంతమందిని పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకుంటూ.. మరోవైపు వీటికి బానిసైన వారికి కౌన్సెలింగ్ ఇవ్వడమే కాకుండా వారి తల్లిదండ్రులను పిలిపించి హెచ్చరించి పంపిస్తున్నట్లు తెలిసింది. గంజాయి విక్రయదారులను కట్టడి చేయాలన్న ఉద్దేశంతో ప్రతిరోజు కళాశాలల ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పలు కేసులు వెలుగులోకి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తున్న.. తాగిన కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గంజాయిని కట్టడికి ప్రతిఒక్కరూ బాధ్యతగా సహకరించాలని, గంజాయి సమాచారం పోలీసులకు ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి దాడులు చేస్తామని పేర్కొన్నారు.

మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

కుత్బుల్లాపూర్: మురుగునీటి సమస్యను పరిష్కరిస్తామని బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అపర్ణ పామ్‌గ్రోవ్‌లో అధికారులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మురుగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఇప్పటికే నిధులు విడుదల చేసి శాశ్వత పరిష్కారం దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, కొంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, ఏఈ ప్రవీణ్, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీధర్, ఇరిగేషన్ అధికారులు, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ వినోద్, దప్పు కిరణ్, పూజారి వసంత, మహిళా అధ్యక్షురాలు సంగీతా ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే


లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే వివేకానంద్

గాజులరామారం డివిజన్ నల్లగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన కల్యాణంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇంద్రసేనా గుప్తా, యాదగిరి, శ్రీరాములు, సురేశ్, నరసింహారెడ్డి, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణుయాదవ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్ పాల్గొన్నారు.

అమర జవాన్లకు ఘన నివాళి



షాపూర్‌నగర్‌లో ర్యాలీ తీస్తున్న సీఐటీయూ నాయకులు


నినాదాలు చేస్తూ ర్యాలీ తీస్తున్న కాలనీవాసులు

కుత్బుల్లాపూర్: 'ఆపరేషన్ సిందూర్'లో అమరులైన జవాన్లకు నివాళులర్పిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ రైతు బజారు నుంచి ఉషోదయ టవర్స్ వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండలాధ్యక్షుడు కీలుకాని లక్ష్మణ్, నాయకుడు సత్యం మాట్లాడుతూ.. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంతో అమాయక ప్రజలు బలవుతున్నారన్నారు. 'ఆపరేషన్ సిందూర్'లో మన వీర జవాన్లు మురళీనాయక్, సచిన్ యాదవ్ దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలని, ప్రపంచదేశాలు కలిసికట్టుగా పాక్ దుశ్చర్యలను వ్యతిరేకించాలని కోరారు. ఉగ్రవాదంతో దేశంలో అలజడులు సృష్టించేందుకు యత్నిస్తున్న పాకిస్తాన్‌పై జరుగుతున్న యుద్ధంలో దేశ ప్రజలు మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కమిటీ నాయకులు శ్రీను, రావుల స్వాతి, ఖలీల్, గోపాల్, శంకర్, సాధులు, ఆది నాగరాజు, మల్లారెడ్డి, దుర్గా నాయక్ ఉన్నారు.

కాలనీవాసులు..

జీడిమెట్ల: పాక్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్, సచిన్ యాదవ్‌రావుకు ఎస్.ఆర్.నాయక్‌నగర్ కాలనీవాసులు శ్రద్ధాంజలి ఘటించారు. ఆదివారం ఉదయం కాలనీకి చెందిన గుబ్బల లక్ష్మణ్, శేషాచారి ఆధ్వర్యంలో చిన్నారులతో కలిసి వీర జవాన్ల పేర్లతో నినాదాలు చేస్తూ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భారత జవాన్లు క్షేమంగా ఉండాలని కోరుతూ పోచమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డా.గోపాల్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం


యాగంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు


కలశ పూజలో భక్తులు

రంగారెడ్డినగర్: అభయాంజనేయస్వామి సహిత శ్రీరాజరాజేశ్వరి నాగలింగేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం 9 గంటలకు అవాహిత మండప పూజ, మూలమంత్ర హవానాదులు, అష్టోత్తర శత కలశాభిషేకం, నూతన శిఖర కలశ సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన యజ్ఞంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం కలశలతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు శ్రీనాగలింగేశ్వరస్వామి, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

చింతల్: చింతల్ రాంకీ ట్రూ స్పేస్‌లో ఉషా రాణి నేచురోపతి ఆస్పత్రి, ఆక్యుపంక్చర్స్ ఆండ్రో ప్లస్ హాస్పిటల్స్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం వరకు సాగిన శిబిరంలో మొత్తం 60 మందికి పరీక్షలు చేసి పలు సలహాలు, సూచనలు చేశారు. శిబిరంలో ఉషారాణి మెమోరియల్ ట్రస్ట్, ఉషారాణి నేచురోపతి క్లినిక్ డాక్టర్ రాధిక, డాక్టర్ ఫెయిర్లీ, న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్: రేపు మేడ్చల్‌లో నిర్వహించే పాలిసెట్‌కు అంతా సిద్ధం చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 13న పాలిసెట్ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మేడ్చల్‌లోని గిర్మాపూర్ పాలిటెక్నిక్ కళాశాల, స్ఫూర్తి, ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల, హైటెక్, హైటెక్ మోడ్రన్, ఎస్ఎస్‌జీ, ఆక్స్‌ఫర్డ్, ఢిల్లీ వరల్డ్ పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం1.30 వరకు ఉంటుందని ప్రిన్సిపాల్ అరుంధతి ప్రకటించారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


నాభిశిల బొడ్రాయి వద్ద పూజలు

జగద్గిరిగుట్ట : జగద్గిరిగుట్ట, భూదేవి హిల్స్‌లో పెద్దమ్మతల్లి విగ్రహం, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ముగిసింది. ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం పెద్దమ్మతల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు బోనాలతో వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా 10 గంటలకు నాభిశిల బొడ్రాయిని ప్రతిష్ఠించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.



సోషల్ మీడియాలో యుద్ధం వీడియోలు పోస్ట్ చేయొద్దు

కీసర: కీసర పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రగ్స్ నివారణకు ప్రజలందరూ సహకరించాలని, గంజాయి విక్రయించే వ్యక్తుల సమాచారం పోలీసులకు తెలపాలన్నారు. భారత్-పాక్ యుద్ధం నేపథ్యంలో సోషల్ మీడియాలో యుద్ధానికి సంబంధించిన వీడియోలు, మతపరంగా విద్వేషాలు వచ్చే వీడియోలు, పోస్టులు చేయకూడదని సూచించారు. అదే విధంగా ర్యాలీలు నిర్వహించొద్దని తెలిపారు. ఎస్సైలు వెంకటేష్, లక్ష్మణ్, నాగరాజు, నాయకులు తదితరులున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బహదూర్‌పల్లిలోని డబుల్‌బెడ్రూంల సముదాయంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ సభ్యులు శ్రీశైలంగౌడ్‌ను ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసంపూర్తిగా డబుల్ బెడ్రూంలను నిర్మించి లబ్ధిదారులకు కేటాయించిందని, దీంతో ప్రస్తుత నివాసితులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి మౌలిక వసతులు మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. అదే విధంగా పలువురు ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, డబుల్‌బెడ్రూం నివాసితులు పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వ తీరుపై జర్నలిస్టులు, ప్రజా సంఘాల నిరసన


జవహర్‌నగర్‌లో అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద నిరసన తెలుపుతున్న నేతలు, జర్నలిస్టులు

జవహర్‌నగర్: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తోందని పలు జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల నేతలు ఆరోపించారు. నిజాలను నిర్భయంగా రాస్తున్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. కేసుల పేరుతో వేధించడం దారుణమన్నారు. సాక్షి దినపత్రిక సంపాదకుడు ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో ఎలాంటి అనుమతులు, నోటీసులు లేకుండా సోదాల పేరుతో దౌర్జన్యానికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో జర్నలిస్టులు, ప్రజాసంఘాల నేతృత్వంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేడ్కర్, జగ్జీవన్‌రాంల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను కాలరాస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు శివబాబు, క్రాంతి కళా బృందం అధ్యక్షుడు వెంకటచారి, జంగిడి శ్రీనివాస్, మహనీయుల ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మొగిలిపాక పరశురాం, మేడ్చల్ నియోజకవర్గ జర్నలిస్టులు మండల మురళీధర్, సత్యనారాయణ, అంజిరెడ్డి, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్ యాదవ్, భూపాల్, జవహర్‌నగర్ జర్నలిస్టులు నర్సింహయాదవ్, నాగరాజు, శ్రీధర్, తూటి శ్రీనివాస్, పోరండ్ల యాదగిరి, లక్ష్మణ్, దేవేందర్, శ్రీనివాస్, వెంకటక్రిష్ణ,కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ బోనాలు

మేడ్చల్: పూడూర్‌లో కట్టమైసమ్మ బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడేళ్లకోసారి గ్రామదేవతల పండగను గ్రామంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈనెల 15 వరకు గ్రామంలో గ్రామదేవతల జాతర కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామస్తులందరూ బోనాల పండుగను నిర్వహించడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

మారని జీవితం!



నామమాత్రపు వేతనాలతో మున్సిపల్ కార్మికుల సతమతం

- దుర్భర జీవితం గడుపుతున్న సిబ్బంది
- కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్
- మరోవైపు వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు

జవహర్‌నగర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికులు దుర్భర జీవితాలను గడుపుతున్నారు. పిన్న వయస్సులోనే పారిశుద్ధ్య కార్మికులు జబ్బు బారినపడి ఆసుపత్రి పాలవుతున్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండేందుకు రోజూ కష్టపడుతున్నా.. పట్టించుకునేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీవో 212 ప్రకారం సౌకర్యాలు..

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 130 మంది కార్మికులు పనిచేస్తున్నారు. కాగా గ్రామపంచాయితీ ఏర్పడినప్పటి నుంచి పనిచేస్తున్న సిబ్బందికి మారుతున్న కాలాన్ని బట్టి రోజూవారి వేతనం పెరగడానికి చాలా ఏళ్లు పట్టింది. పారిశుద్ధ్య సిబ్బందికి కనీసవేతనాలు చెల్లించాలని జీవో నెం.212 ప్రకారం ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని అనేక ఏళ్లగా కార్మిక నాయకులు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. 2008 డిసెంబర్ నెలలో కాంట్రాక్ట్ కార్మికులకు పాత జీవోను చట్టం చేస్తూ.. కొత్త జీవో ప్రకారం నెలవారీ జీతంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించారు. బ్యాంకుల ద్వారా జీతాలు ఇవ్వాలని, అది నేటికి అమలు కావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాజాగా జీవో 65 అమలు..

గత ప్రభుత్వం జీవో 14 ప్రకారం అమలు చేయగా.. ప్రస్తుత ప్రభుత్వం జీవో 65ను అమలు చేస్తోంది. జీవోనెం 60 ప్రకారం వేతనాలు పెంచి, గతంలో కార్మికులకు పెంచిన జీతాలను తగ్గించకుండా వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

అనారోగ్య సమస్యలు..

పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారి కుటుంబాల్లో రోజూ ఎవరో ఒకరూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. శ్వాసకోస వ్యాధులు, ఇన్‌ఫెక్షన్‌కు గురై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కార్మికుల జీవితాలకు సరైన భద్రత లేకుండా పోయిందనే విమర్శలున్నాయి.

సగానికి పైగా 25 ఏళ్ల సర్వీను..

జవహర్‌నగర్ పట్టణంలో పనిచేస్తున్న 130 మంది కార్మికుల్లో సగానికి పైగా 25 ఏళ్ల సర్వీసు ఉన్నవారే. అందరికీ నిర్దిష్ట పని గంటలు ఉన్నా.. వీరికి వర్తించవు. ఇంతచేసినా.. వీరికి ఇచ్చే వేతనం నామమాత్రమే. కాలానికి అనుగుణంగా కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవడం లేదు. పారిశుద్ధ్య కార్మికులు అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు పట్టణ కార్పొరేషన్ ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

ఉద్యోగ భద్రత కరువు ..

కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. ఐదేళ్లపాటు పనిచేసిన వారికి ఉద్యోగ భద్రత కల్పించాలనే నిబంధన ఉంది. అయితే స్థానిక సంస్థలకు పూర్తిస్థాయిలో అధికారాలు ఇవ్వకపోవడం వల్ల ఆ నిబంధన అమలుకు నోచుకోవడం లేదు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు రోజూ అడుగుతున్నప్పటికీ వారిని పట్టించుకునే వారు లేక పోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జవహర్‌నగర్ ప్రధాన రహదారి పక్కన చెత్తను తొలగిస్తున్న కార్మికులు (ఫైల్)

ఉద్యోగ భద్రత కల్పించాలి..



కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలి. జీవిత బీమాను వెంటనే అమలు చేయాలి. తెలంగాణ వస్తే మా ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయని అనుకున్నాం. కానీ నేటికి ప్రభుత్వం అమలు చేయడంలేదు. ప్రతీ కార్మికుడికి రూ.26 వేల కనీసం వేతనం చెల్లించాలి.

– రాములు, ఎలక్ట్రీషన్, జవహర్‌నగర్


హెల్త్‌కార్డులు ఇవ్వాలి..



నిత్యం పారిశుద్ధ్య పనులు చేసుకుంటూ రోగాలబారిన పడుతున్నాం. కనీస వేతనం లేక ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లలేకే ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికులకు హెల్త్‌కార్డులు ఇచ్చి, ఉచిత వైద్యం అందించాలి.

– వెంకటమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటమే..



ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెలబెట్టుకుని కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి. కార్పొరేషన్‌లో కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేసి పర్మనెంట్ చేయాలి. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలి. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలను ఆపేదిలేదు.

– శివబాబు, రాష్ట్ర మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి